క్లుప్తంగా

ఫ్రీవిల్ యూత్ అధ్యక్షుడిగా కృష్ణ



రేగొండ: మండల కేంద్రంలో ఫ్రీవిల్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు నామాల రమేశ్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుకూరి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా సామల సాంబయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. యూత్ ద్వారా గ్రామంలో చేసే మంచి పనులు భవిష్యత్‌లో కూడా కొనసాగుతాయన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కాటారం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ వైద్యుడు తిరుపతి సూచించారు. మండలంలోని గూడూరు, జాదారావుపేట గ్రామాల్లో మండల వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. పలు వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో డ్రైడే నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి జ్వర సర్వే చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు శ్యామల, సుజాత, ఆశాకార్యకర్తలు స్వరూప, వెంకటమ్మ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కాటారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంఈఓ దేవా నాయక్ అన్నారు. మహాముత్తారంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యతకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమయానుకూలంగా క్రీడలపై మక్కువ పెంచుకుంటే భవిష్యత్‌లో రాణించవచ్చన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల ద్వారా గ్రామీణ విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభ వెలికితీయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ క్రీడల జిల్లా కార్యదర్శి సిరంగి రమేశ్, హెచ్‌ఎంలు ప్రకాశ్, హట్కర్ దేవ్‌సింగ్, పీడీలు శ్రీలత, మమత, జితేందర్, భానుప్రకాశ్, జయపాల్, భారతి, రాజబాబు, పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి



కాటారం: పిల్లలకు సరైన పోషకాహారం అందిస్తేనే వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని మండల వైద్యాధికారిణి మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. మండలంలోని నస్తూర్‌పల్లిలో శనివారం గ్రోత్‌మేళా నిర్వహించారు. గ్రామంలోని పిల్లల ఎత్తు, బరువులు కొలిచారు. వయస్సు ప్రకారం ఎంత బరువు, ఎంత ఎత్తు ఉండాలని స్క్రీనింగ్ చేశారు. తక్కువ బరువు కల్గిన పిల్లలకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు పెరగడం కోసం తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి, సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలను పిల్లలకు పెట్టాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పీహెచ్‌ఎన్ అన్నపూర్ణదేవి, అంగన్‌వాడీ టీచర్ రత్నకుమారి, ఏఎన్‌ఎం సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్ నగర్ మోడల్‌స్కూల్‌లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో టీజీటీ హిందీ, పీజీటీ సివిక్స్, పీజీటీ కామర్స్, పీజీటీ ఫిజిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు ఈనెల 23న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలకు రావాలన్నారు.

మహోన్నత వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ



టేకుమట్లలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



భూపాలపల్లి రూరల్: వేడుకల్లో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు

కాటారం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన మంత్రి పదవిని సైతం వదిలేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని పలువురు కొనియాడారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిట్యాల: మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏవైఎస్ నాయకులు రాజేందర్, జన్నే యుగేందర్, తిరుపతి, కిషన్, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్లలో..

మండలకేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని చేనేత సహకార సంఘాల నాయకులు, చేనేత కార్మికులు, పద్మశాలి సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఆడెపు సంపత్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగ నరేష్, నాయకులు రాములు, రమేష్, రాజేష్, సారయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో..

భూపాలపల్లి రూరల్: కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని హెచ్‌ఎంఆర్డీఎస్ దివ్యాంగ పాఠశాలలో పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మశాలీ జిల్లా అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాపూజీ తొలి, మలితరం తెలంగాణ ఉద్యమాల్లో ముందుండి నడిపించారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, భాగవతం భిక్షపతి, ప్రభాకర్, కుసుమ కృష్ణమోహన్,సామల శ్రీనివాస్, దాసరి సుదర్శన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో..

ఐఎన్‌టీయూసీ కృషితోనే 33 శాతం లాభాల వాటా

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు లాభాల వాటా 33శాతం రావడానికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ నిరంతరం కృషి చేశారని యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు అధికంగా కష్టపడి రక్తాన్ని చెమటగా మార్చి సింగరేణి వ్యాప్తంగా కార్మికులు వేల కోట్ల రూపాయల లాభాలను తీసుకురావడం జరిగిందన్నారు. సింగరేణి కార్మికులకు గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి గత ఏడాదికి కంటే ఒక శాతం వాటా లాభాలను పెంచినట్లు తెలిపారు. కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అన్నింటినికి జనక్‌ప్రసాద్ నేతృత్వంలో ఒక్కొక్కటికీ పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రాజేందర్, రాజేశ్, సదయ్య, ఆశోక్, వేణుగోపాల్, రాంబాబు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై దృష్టిసారించాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సుదీర్ఘ పోరాట ఫలితమే లాభాల వాటా అని, వేతనాల పెంపుపై కూడా ప్రభుత్వం దృష్టిసారించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు కంపేటి రాజయ్య ప్రకటనలో తెలిపారు. లాభాల వాటాల్లో వ్యత్యాసం చూపించడం బాధకరమని పేర్కొన్నారు. సీఎం ప్రకటించినట్లుగా సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ రూ.5వేల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాల పెంపుపై దృష్టిసారించాలని కోరారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితమే..

భూపాలపల్లి అర్బన్: ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన పరిశ్రమ నుంచి లాభాల వాటా ఇప్పించేందుకు లాభాల వాట సృష్టికర్త ఏఐటీయూసీ నాయకుడు కేఎల్ మహేంద్ర పోరాటాలు నిర్వహించినట్లు ఏఐటీయూసీ బ్రాంచీ అసిస్టెంట్ కార్యదర్శి గురుజపెల్లి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మాతంగి రాంచందర్‌లు తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు చంద్రమౌళి, కొమురయ్యలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ దందాపై చర్య తీసుకోవాలి

మొగుళ్లపల్లి: ఇసుక అక్రమ దందా చేసేవారు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేరును వాడుకొని చెడ్డ పేరు తేవొద్దని.. అలాంటి వారిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి రాజు అధికారులను కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో ఇసుక మాఫియా ముఠాగా ఏర్పడిన కొందరు వ్యక్తులు అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎమ్మెల్యే పేరును వాడుకుంటూ ఆయనకు చెడ్డ పేరు తేవడానికి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకొని ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై, ప్రజలపై ఉందన్నారు. వాగుల సమీపంలోని గ్రామాల ప్రజలు ఇల్లు కట్టుకునేందుకు మాత్రమే ఎమ్మెల్యే పర్మిషన్ ఇవ్వాలని అధికారులను కోరారని అన్నారు. ఎమ్మెల్యేకు చెడ్డపేరు తేవాలనే సంకల్పంతో ప్రతిపక్ష నాయకులు కొందరిలతో ఇసుక మాఫియా ముఠాను ఏర్పాటు చేయించి.. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా బయటకు తరలిస్తూ..సొమ్ము చేసుకుంటున్నారన్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో చికెన్ వ్యాపారి ఆత్మహత్య



కరుణాకర్‌రెడ్డి (ఫైల్)

రేగొండ: మండల కేంద్రానికి చెందిన చికెన్ వ్యాపారి ఆర్థిక ఇబ్బందులతో వేములవాడలో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో చికెన్ వ్యాపారం చేసే పన్నాల కరుణాకర్ రెడ్డి (42) ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కొన్ని రోజుల తర్వాత గ్రామానికి వచ్చి అందరి అప్పులు తీరుస్తానని నమ్మబలికాడు. కానీ ఇటీవల మళ్లీ అప్పుల వాళ్ల బాధలు తీవ్రమవడంతో వారం రోజుల క్రితం మళ్లీ ఇంటి నుంచి పరారయ్యాడు. కాగా శనివారం సిరిసిల్ల రాజన్న జిల్లా వేములవాడలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాటారం: మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సుబ్బయ్యపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపల్లికి చెందిన గువ్వల రవి(35) స్థానికంగా హమాలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై చింతకాని క్రాస్ వద్దకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో తిరిగి వెళ్తున్న క్రమంలో వెనకాల వచ్చిన గుర్తు తెలియని మరో బైక్ వేగంగా ఢీ కొట్టింది. దీంతో రవి రోడ్డుపై ఎగిరిపడటంతో తలతో పాటు శరీరంపై పలు చోట్ల తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటు వైపుగా వెళ్లిన పలువురు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తి అతివేగంగా అజాగ్రత్తగా బైక్ నడుపుతూ వచ్చి రవి బైక్‌ను ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలపడంతో పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, మృతుడు రవికి భార్య సుమలత, ముగ్గురు కుమారులు రఘువరన్, రక్షిత్, రాహుల్ ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

రేగొండ : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్డీఓ అవినాష్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు మండలంలోని 37 గ్రామపంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో చేపట్టిన 708 పనులకు గాను మొత్తం రూ. 3,74,09,727 కోట్లు ఖర్చు చేయగా కూలీలకు వేతనాలుగా రూ. 3,44,00,363 కోట్లు, సామగ్రి చెల్లింపులకు రూ. 30,08,764 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్‌కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరులేకుండా వేతనాలు చెల్లింపులు, మస్టర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదాలు, పనిప్రదేశం తేడాలు వంటి తప్పిదాలపై మండలంలోని 37 జీపీలకు గాను రూ.1,10,000 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. అలాగే చనిపోయిన మొక్కలు వారంలోపు తిరిగి నాటించాలని అధికారులను డీఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి దస్సింగ్, విజిలెన్స్ అధికారి రుబినా బేగం, అంబుడ్‌మెన్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంప్రసాద్‌రావు, ఏపీఓ జమీర్ పాషా, ఈసీ మధుకర్, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ కొమురయ్య, డీఆర్‌పీ రమేష్, రాజు, సంధ్యారాణి, టీఎలు రాజు, మధుకర్, రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ

మల్హర్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ అన్నారు. మండల కేంద్రం తాడిచర్ల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మండల పరిషత్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా భవిష్యత్‌ను నిర్దేశించుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ విజయదేవి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ పరిసరాల పరిశుభ్రత గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని, చక్కటి ఆరోగ్యావంతమైన జీవన విధానాన్ని పాటించి, క్రమశిక్షణతో బాగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవ పైన క్విజ్‌ను నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, అధ్యాపకులు నరేందర్, ప్రవీణ్, వెంకటరెడ్డి, కరుణాకర్, స్వరూప రాణి, నరేష్, భరత్ రెడ్డి, జయపాల్, రవి, ఉమామహేశ్వరి, ఆఫీస్ సిబ్బంది రాములు, రవి, కిరణ్, షబ్బీర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నిజాయితీగా ఓటును వినియోగించుకోవాలి



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కాళేశ్వరం: నిజాయితీగా ఓటును వినియోగించుకోవాలని గ్రీన్‌వుడ్ కాన్సెప్ట్ పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్‌కాన్సెప్ట్ స్కూల్ పాఠశాలలో (ఎస్పీఎల్) స్కూల్ పుపిల్ లీడర్, (ఏఎస్పీఎల్) అసిస్టెంట్ స్కూల్ పుపిల్ లీడర్ ఎన్నిక కోసం శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓట్లు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలు జారీ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటర్లు, అభ్యర్థులుగా విద్యార్థులు వ్యవహరించారు. పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉంటుందని అన్నారు. ఓటును సక్రమంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో రాజకీయ రంగంలోకి వచ్చి మంచి పదవులను పొంది దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. మంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి మాక్ పోలింగ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ఎన్నికల సందర్భంగా సుమారు 700 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, క్రమశిక్షణగా క్యూలో నిలబడి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గెలుపొందిన అభ్యర్థులకు యాజమాన్యం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి



ఖోఖో ఆడుతున్న ఎస్సై ఎండీ. శాఖాన్

చిట్యాల: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎస్సై ఎండీ. శాఖాన్, ఎంఈఓ రఘుపతి అన్నారు. శుక్రవారం మండలంలోని చల్లగరిగ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడలు (కబడ్డీ, ఖోఖో, వాలీబాల్) నిర్వహించారు. ఈ క్రీడల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై, ఎంఈఓ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. మండలంలో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో చక్కగా ఆడి మండలానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ క్రీడలలో 450 మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరంగి రమేశ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ కవిత, కబడ్డీ క్రీడాకారుడు ఎండీ.రబ్బానీ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు వేల్పుల రాజ్‌కుమార్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రహీంపాషా, ఫిజికల్ డైరెక్టర్లు సూదం సాంబమూర్తి, ఎన్.లింగయ్య, శ్రీనివాస్, భాస్కర్, సమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెన్నెల, ఉమ, రాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



చిట్యాల: మాట్లాడుతున్న హెచ్‌ఎం రవ్వ జగదీశ్



కాళేశ్వరం: తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

చిట్యాల: విద్యార్థులపై వారి తల్లిదండ్రులు ప్రతిరోజు శ్రద్ధ చూపాలని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవ్వ జగదీశ్ అన్నారు. శనివారం మండలంలోని అందుకుతండా ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పరిశుభ్రంగా పాఠశాలకు పంపించాలని కోరారు. అలాగే వర్షాకాలంలో విషజ్వాలు వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్, చిరంజీవి, దేవేందర్, పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పిల్లలచే పాదపూజ

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర,బాలికల పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పాదాలు కడిగి పూలతో పూజ చేసి ఆ నీళ్లను తలపై చల్లుకుని, వారి ఆశీస్సులు తీసుకున్నారు. తల్లిదండ్రులు పూలు, అక్షింతలు వేసి పిల్లల్ని దీవించారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. దసరా సెలవుల తర్వాత జరిగే సమ్మేటివ్ అసెస్మెంట్ టెస్ట్ గురించి సెలవులలో విద్యార్థులు చదవాల్సిన విషయాలను ప్రత్యేకంగా ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఎలా సిద్ధం కావాలో వివరించారు. ప్రధానోపాధ్యాయుడు బి.రాజిరెడ్డి, పి.సరిత, ఏఏపీసీ చైర్‌పర్సన్ స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

'నా వ్యాఖ్యలు వక్రీకరిస్తున్నారు'

టేకుమట్ల: 'యథేచ్ఛగా మొరం తవ్వకాలు' అనే కథనం 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనం విదితమే. కాగా ఆ కథనంలో చెరువు కట్ట మొరాన్ని తవ్వకూడదని అని మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి చేసిన వ్యాఖ్యలను మండలంలోని అంకుషాపూర్ గ్రామస్తులు సోషల్ మీడియా వేదికగా చర్చించుకున్న విషయంపై ఆయన స్పందిస్తూ వివరణ ఇచ్చారు. చెరువు కట్ట తవ్వకూడదని తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారన్నారు. రైతుల పంట పొలాల్లోకి వెళ్లే దారి గుంతలను పూడ్చేందుకు చెరువు కట్ట వద్ద వద్దని, అవసరమైతే తన సొంత పట్టా భూమి నుంచి మొరాన్ని తీసుకువెళ్లొచ్చని అని అన్నాను. చెరువు కట్టను తవ్వడం వల్ల అధికారులు ఇబ్బంది పడతారని, కావున మరో చోట లేదా తన భూమిలో తవ్వుకొమ్మని చెప్పినట్లు తెలిపారు. దానికి మొత్తం మొరాన్నే ఆపమన్నానంటూ కొంత మంది చేస్తున్న అసత్య ప్రచారాన్ని పరిగణలోకి తీసుకోవద్దని వివరణ ఇచ్చారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

భూపాలపల్లి రూరల్: అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ రిజర్వేషన్లను రద్దు చేయాలని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు భట్టు రవి తెలిపారు. అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పుల్యాల రాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం భట్టు రవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యుగంధర్ మాట్లాడుతూ.. భారత వ్యతిరేక శక్తులు, వ్యక్తులతో రాహుల్ సమావేశం అవడం దుర్మార్గమన్నారు. బీజేపీ జిల్లా నాయకులు రాజేందర్, రవీందర్ సేనాపతి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: మండలంలోని వివిధ గ్రామాల కూడలి, మండల కేంద్రంలో ఎస్సై తాజొద్దీన్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ముందుజాగ్రత్తలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాల్లో ప్రయాణించేవారి వివరాలను సేకరించారు. 163 జాతీయ వెంట ఛత్తీస్‌గఢ్ వెళ్లే వాహనాలపై నజర్ వేశారు. సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.